గాండే ఉప ఎన్నిక బరిలో హేమంత్ సోరేన్ సతీమణి కల్పన

పోటీ చేస్తున్నట్టు ప్రకటన

రాంచీ, ఏప్రిల్ 25: జార్ఖండ్‌లో జరిగే గాండే అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికలో మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరేన్ సతీమణి కల్పనా సోరేన్ పోటీ చేస్తారని జార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) గురువారం ప్రకటించింది. జేఎంఎం ఎమ్మెల్యే సర్ఫరాజ్ అహ్మద్ రాజీనామాతో ఖాళీ అయిన ఈ స్థానానికి మే 20న ఉప ఎన్నిక జరుగనుంది. ప్రస్తుతం గృహిణిగా ఉన్న కల్పనా ఎంటెక్, ఎంబీఏ చదువుకున్నారు. మనీలాండరింగ్ కేసులో హేమంత్ సోరేన్ అరెస్టయిన విషయం తెలిసిందే.

జనంపై ధరలు 'మోది'!

బీజేపీ హయాంలో నిత్యావసరాల ధరలు పైపైకి

- ఉప్పు, పప్పు నుంచి కూరగాయల వరకూ భగ్గు
- పదేండ్ల పాలనలో 300 శాతం వరకూ పెరుగుదల
- చమురుమంట, సాగు పెట్టుబడి ఖర్చూ కారణమే
- ముగ్గురికి వారం భోజనం ఖర్చు రూ.2 వేల పైనే
- ధరలకు కళ్లెం వేయడంలో మోదీ సర్కారు ఫెయిల్
- సీఎస్‌డీఎస్ సర్వేలో 57% మంది అభిప్రాయం ఇదే
- ఎన్నికలపై ధరల ప్రభావం ఉంటుందన్న ఓటర్లు



(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ): బియ్యం, వంటనూనె, పప్పులు, గోధుమపిండి, చక్కెర, పాలు, ఆలుగడ్డ, చింతపండు ఇలా అన్నింటి ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. కేంద్రం చమురు రేట్లను పెంచితే, దాని దెబ్బ వ్యవసాయ పెట్టుబడి, రవాణా వ్యవస్థపై పడింది. తద్వారా ఆ ప్రభావంతో సరుకుల ధరలు నింగినంటాయి. మరోవైపు మోదీ ప్రభుత్వం ముందుచూపులేని విధానాలతో అంతర్జాతీయంగా రూపాయి అధఃపాతాళానికి చేరుకొన్నది. దీని ప్రభావం దిగుమతులపై పడి అంతిమంగా అది నిత్యావసరాల ధరలు ఆకాశానికి చేరేలా చేసింది. ప్రతీరోజూ కూరల్లో ఉపయోగించే అల్లం, వెల్లుల్లి, పచ్చిమిర్చితో పాటు క్యాప్సికం, బీన్స్ వంటి కూరగాయలు, వంటింటి మసాలాల ధరలు అందుకోలేని విధంగా పెరిగిపోయాయి. మొత్తంగా గడిచిన ఆరేడు నెలల్లోనే వివిధ కూరగాయలు, నిత్యావసరాల ధరలు 10 నుంచి 200 శాతం వరకు పెరిగినట్టు విశ్లేషకులు చెబుతున్నారు.

మంట రేపుతున్న రూపాయి పతనం

2014లో మోదీ ప్రధానిగా అధికారం చేపట్టిన నాటి నుంచి నిత్యావసరాల ధరలు సుమారు 300 శాతం పెరిగినట్టు లోకల్ సర్కిల్స్ నిర్వహించిన సర్వేలో వెల్లడైంది. ఇంధన ధరల పెరుగుదలతో రవాణా చార్జీలు 31 శాతం వరకు పెరిగినట్టు ట్రావెల్ ఏజెన్సీలు చెబుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లలో క్రూడాయిల్ ధరలు తగ్గినప్పటికీ, ఆ లాభాన్ని విని యోగదారుడికి అందకుండా బీజేపీ సర్కారు ఖజానాకు మళ్లించింది. గడిచిన పదేండ్ల మోదీ సర్కారు డీజిల్‌పై 343 శాతం, పెట్రోల్‌పై 109 శాతం ఎక్సైజ్ పన్నులను పెంచినట్టు పెట్రోలియం ప్లానింగ్ అండ్ అనాలిసిస్ సెల్ (పీపీఏసీ) నివేదిక వెల్లడించింది. ఇదిలాఉండగా అంతర్జాతీయంగా రూపాయి చారిత్రక స్థాయికి పతనమవ్వడం పరిస్థితిని మరింతగా దిగజార్చింది. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు పెరుగుతుండటం, పెట్రోల్‌పై కేంద్రం సుంకాలను తగ్గించకపోవడంతో రానున్న రోజుల్లో నిత్యావసరాల ధరలు మరింతగా పెరిగే ప్రమాదమున్నదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఎన్నికలపై తీవ్ర ప్రభావం

ధరలకు కళ్లెం వేయడంలో ప్రధాని మోదీ ప్రభుత్వం ఫెయిల్ అయినట్టు 57 శాతం మంది అభిప్రాయపడ్డారు. ధరాఘాతాన్ని దృష్టిలో ఉంచుకొనే ఈ ఎన్నికల్లో ఓటేస్తామని 23 శాతం మంది ఓటర్లు చెప్పారు. ఈ మేరకు సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ డెవలపింగ్ సొసైటీస్ (సీఎస్‌డీఎస్), లోక్ నీతి సంయుక్తంగా జరిపిన సర్వేలో తేటతెల్లమైంది. అంతర్జాతీయ పరిణామాలను అటుంచితే, ధరల కట్టడికి అవకాశం ఉన్నప్పటికీ విధానపరంగా కేంద్ర ప్రభుత్వం ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోలేదని సర్వేలో పాల్గొన్న మెజారిటీ ఓటర్లు అభిప్రాయపడ్డారు. గడిచిన 43 ఏండ్లలో ఎన్నడూ చూడని స్థాయిలో ధరలు పెరిగినట్టు వాపోయారు. ఈ వివరాలను ఇంగ్లిష్ పత్రిక 'మింట్' ప్రచురించింది.

పదేండ్లలో వేటి ధర ఎంతలా పెరిగిందంటే??

ఇంధనం	2014	2024	పెరుగుదల
పెట్రోల్	రూ. 71	రూ. 107	50.7%
డీజిల్	రూ. 55	రూ. 95	72.72%
వంటగ్యాస్	రూ. 399	రూ. 855	114.28%
నిత్యావసరాలు (కిలోకు)	**2014**	**2024**	**పెరుగుదల**
బియ్యం	రూ. 27	రూ. 65	140%
పల్లినూనె	రూ. 83	రూ. 155	86%
గోధుమపిండి	రూ. 22	రూ. 65	195%
ఉప్పు	రూ. 10	రూ. 25	150%
చక్కెర	రూ. 24	రూ. 48	100%
పాలు (లీటర్)	రూ. 38	రూ. 65	71%
ఆలుగడ్డలు	రూ. 18	రూ. 35	94%
చాయపత్త	రూ. 194	రూ. 320	64%
చింతపండు	రూ. 40	రూ. 160	300%
పప్పుదినుసులు (కిలో)	**2014**	**2024**	**పెరుగుదల**
కందిపప్పు	రూ. 50	రూ. 160	220%
మినప్పప్పు	రూ. 32	రూ. 150	368%
శనగపప్పు	రూ. 24	రూ. 75	212%
ఇతర ఆహారం	**2014**	**2024**	**పెరుగుదల**
అరటిపండ్లు (డజను)	రూ. 33	రూ. 65	96%
కోడిగుడ్లు (డజను)	రూ. 38	రూ. 70	84%

ముగ్గురు సభ్యులున్న కుటుంబం భోజనం ఖర్చు

సంవత్సరం	వారానికి	రోజుకు	ప్లేటుకు	పెరుగుదల
2014	రూ. 1,008	రూ. 144	రూ. 48	–
2024	రూ. 2,000	రూ. 285	రూ. 95	98%

కేరళలో ఎన్నికల సామగ్రితో పోలింగ్ కేంద్రానికి తరలివెళ్తున్న సిబ్బంది

నేడే రెండో విడత

- 89 స్థానాలకు పోలింగ్
- పోటీలో 1,206 మంది
- బరిలో రాహుల్, కుమారస్వామి, థరూర్, రాజీవ్ చంద్రశేఖర్, హేమామాలిని, ఓం బిర్లా

న్యూఢిల్లీ, ఏప్రిల్ 25: లోక్‌సభ ఎన్నికల రెండో విడత పోలింగ్ శుక్రవారం జరగనుంది. 13 రాష్ట్రాల్లోని 89 లోక్‌సభ స్థానాలకు ఈ విడతలో ఎన్నికలు జరుగుతాయి. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ పోటీ చేస్తున్న వయనాడ్ సహా కేరళలోని మొత్తం 20 లోక్‌సభ స్థానాలకు ఇదే విడతలో పోలింగ్ జరగనుంది. కర్ణాటకలోని 28 స్థానాల్లో 14 స్థానాలకు, రాజస్థాన్‌లో 8 సీట్లు, ఉత్తరప్రదేశ్‌లో 8, మధ్యప్రదేశ్‌లో 7, అస్సాంలో 5, బీహార్‌లో 5, ఛత్తీస్‌గఢ్‌లో 3, పశ్చిమ బెంగాల్‌లో 3 స్థానాలకు, మణిపూర్, త్రిపుర, జమ్ము కశ్మీర్‌లో ఒక్కొక్క స్థానానికి ఈ విడతలో ఎన్నికలు జరగనున్నాయి. మొత్తం 1,206 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. కాంగ్రెస్ నేతలు శశి థరూర్, కేసీ వేణుగోపాల్, కేంద్రమంత్రి రాజీవ్ చంద్రశేఖర్, అరుణ్ గోవిల్(రామాయణం సీరియల్ రాముడి పాత్రధారి), కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ సోదరుడు డీకే సురేశ్, కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి హెచ్‌డీ కుమారస్వామి, నటి హేమమాలిని, స్పీకర్ ఓం బిర్లా, కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ తదితర ప్రముఖులు ఈ విడతలో తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. రెండో విడత పోలింగ్‌తో కేరళ, రాజస్థాన్, త్రిపురలోని అన్ని స్థానాలకు పోలింగ్ పూర్తవుతుంది. ఇప్పటికే ఏప్రిల్ 19న జరిగిన మొదటి విడతలో తమిళనాడు, ఉత్తరాఖండ్, అరుణాచల్ ప్రదేశ్, మేఘాలయ, అండమాన్, నికోబార్ దీవులు, మిజోరం, నాగాలాండ్, పుదుచ్చేరి, సిక్కిం, లక్షద్వీప్‌లో అన్ని స్థానాలకు ఎన్నికలు పూర్తయ్యాయి.

లోక్‌సభ ఎన్నికల ఖర్చు రూ. 1.35 లక్షల కోట్లు!

ప్రపంచంలోనే ఖరీదైన ఎన్నికలివి ● ఎన్నికల నిపుణుడు భాస్కర్ రావు

న్యూఢిల్లీ: భారత్‌లో జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల సమరం.. ప్రపంచంలోనే అత్యంత ఖరీదైనదిగా నిపుణులు అంచనావేస్తున్నారు. గత రికార్డులను 2024 సార్వత్రిక ఎన్నికలు బ్రేక్ చేస్తాయని వారు చెబుతున్నారు. భారత్‌లో ఈసారి ఎన్నికల వ్యయం రూ.1.35 లక్షల కోట్లకు చేరుకుంటుందని 'సెంటర్ ఫర్ మీడియా స్టడీస్'కు నేతృత్వం వహిస్తున్న ఎన్ భాస్కర్ రావు చెబుతున్నారు. 2019 ఎన్నికల వ్యయం రూ.60 వేల కోట్లతో పోల్చితే, ప్రస్తుత ఎన్నికల వ్యయం రెట్టింపుగా ఉంటుందని చెప్పారు. ఎన్నికల వ్యయానికి సంబంధించిన అంశాలను సెంటర్ ఫర్ మీడియా స్టడీస్ అనే స్వచ్ఛంద సంస్థ, గత 35 ఏండ్లుగా నిశితంగా పరిశీలిస్తున్నది.

బీజేపీ ఎంపీపై భార్య పోటీ

లక్నో: యూపీలోని ఇటావా లోక్‌సభ స్థానంలో భార్యాభర్తల మధ్య పోటీ నెలకొంది. బీజేపీ తరపున సిట్టింగ్ ఎంపీ రామ్ శంకర్ కతేరియా మరోసారి పోటీ చేస్తున్నారు. అయితే, అనూహ్యంగా బుధవారం ఇదే స్థానానికి రామ్ శంకర్ కతేరియా భార్య మ్రిదుల కతేరియా స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. 2019 ఎన్నికల సమయంలోనూ ఆమె ఇలానే స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేసినప్పటికీ చివరి నిమిషంలో ఉపసంహరించుకున్నారు. కాబట్టి, ఆమె ప్రతిసారి నామినేషన్ వేసి విత్‌డ్రా చేసుకుంటారని కతేరియా అన్నారు. అయితే, తాను నామినేషన్ వేసింది విత్‌డ్రా చేసుకోవడానికి కాదని, ఈసారి తాను పోటీ చేస్తానని మ్రిదుల ప్రకటించారు.

వాట్సాప్‌లో సుప్రీంకోర్టు సేవలు

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు కేసుల ఫైలింగ్, లిస్టింగ్, ఇతర వివరాలను ఇకపై న్యాయవాదులకు వాట్సాప్‌లో పంపిస్తామని సీజేఐ చంద్రచూడ్ గురువారం వెల్లడించారు. ఈ కొత్త సౌకర్యం ద్వారా అడ్వొకేట్లు, కక్షిదారులు కేసుల ఫైలింగ్, కోర్టు ఆర్డర్లు, తీర్పులు వాట్సాప్‌లో పొందుతారన్నారు. బార్ అసోసియేషన్ సభ్యులందరికీ కాజ్‌లిస్టులను వాట్సాప్ (8767687676) ద్వారా పంపిస్తామన్నారు.

బుర్కినాఫాసోలో 200 మందికిపైగా ఊచకోత

డాకర్: బుర్కినా ఫాసో దేశ ఆర్మీపై మానవ హక్కుల సంఘం తీవ్ర ఆరోపణలు చేసింది. మిలిటెంట్లకు సహకరిస్తున్నారనే ఆరోపణలపై 223 మంది పౌరులను ఆర్మీ ఊచకోత కోసిందని హ్యూమన్ రైట్స్ వాచ్ వెల్లడించింది. బాధితుల్లో పిల్లలు, పసికందులు ఉన్నారంది. దేశ ఉత్తర ప్రాంత గ్రామాలైన నాండిన్, సోరోలపై ఫిబ్రవరిలో ఈ ఊచకోత జరిగిందని తెలిపింది.

మీ ఉద్యోగాలనూ కాంగ్రెస్ లాక్కుంటుంది

- ఇంటిలో ఇద్దరు ఉద్యోగం చేస్తుంటే, ఒక ఉద్యోగాన్ని 'వనరులపై మొదటి హక్కు' ఉన్నవారికి పంచేస్తుంది
- ఓటు బ్యాంక్ కోసం కాంగ్రెస్ బుజ్జగింపు రాజకీయాలు
- ఇందిర ఆస్తి కోసం వారసత్వ పన్ను రద్దు చేసిందే రాజీవ్‌గాంధీ
- ఎన్నికల ర్యాలీల్లో ప్రధాని మోదీ సంచలన వ్యాఖ్యలు

బరేలీ (యూపీ), ఏప్రిల్ 25 : కాంగ్రెస్ నేతృత్వంలోని 'ఇండియా కూటమి' పార్టీలపై ప్రధాని మోదీ విమర్శలతో విరుచుకుపడ్డారు. గురువారం బరేలి ఎన్నికల ర్యాలీలో మాట్లాడుతూ, 'మీ ఇంటిలో ఇద్దరికి ఉద్యోగాలుంటే..ఒక ఉద్యోగాన్ని కాంగ్రెస్ లాక్కొని, 'వనరులపై మొదటి హక్కు' ఉన్నవారికి అప్పగిస్తుంది' అంటూ సంచలన ఆరోపణలు చేశారు. యాదవ్, కుష్వాహా, మౌర్య, గుర్జర్, రాజ్‌భర్, తెలి, పాల్ వర్గాలతో సహా వెనుకబడిన తరగతులను ప్రస్తావిస్తూ, 'మీ రిజర్వేషన్ హక్కును కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలు లాక్కోకుండా నేను అడ్డుకుంటా. ఇది మోదీ గ్యారంటీ. వెనుకబడిన, దళిత కుటుంబంలోని ఇద్దరు వ్యక్తులు ఉద్యోగం చేస్తే, ఒకరి ఉద్యోగాన్ని తీసివేసి.. దేశ వనరులపై మొదటి హక్కు ఉన్నవారికి కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలు ఇస్తాయి' అంటూ ఓటర్లను హెచ్చరించారు. యూపీలోని షాజహాన్‌పూర్ ఎన్నికల ర్యాలీలో ప్రధాని మాట్లాడుతూ, బుజ్జగింపు రాజకీయాలు ఇద్దరు యువరాజుల్ని ఒక్కదగ్గరికి చేసిందని రాహుల్‌గాంధీ, అఖిలేశ్ యాదవ్‌ను ఉద్దేశించి అన్నారు. మధ్యప్రదేశ్‌లోని మొరెనాలో జరిగిన ఎన్నికల ర్యాలీలో ఆయన ప్రసంగిస్తూ, '1985లో రద్దు చేసిన వారసత్వపు పన్ను చట్టాన్ని మళ్లీ తీసుకురావాలని కాంగ్రెస్ నేతలు చెప్పటం హాస్యాస్పదంగా ఉంది. ఈ చట్టాన్ని మళ్లీ తెస్తే అన్ని వర్గాల ప్రజలు అన్యాయానికి గురవుతారు' అని అన్నారు. 'ముస్లిం వర్గాల ఓటు బ్యాంకు కోసం ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లను కాంగ్రెస్ లాక్కోవాలని చూస్తున్నది. ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించటం చట్ట విరుద్ధం. రాజ్యాంగ విరుద్ధం. ఓబీసీ హక్కులను లాక్కోవడానికి కాంగ్రెస్ తమ అభిమాన ఓటు బ్యాంక్‌ను బలోపేతం చేసేందుకు ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించాలనుకుంటున్నది. మతపరమైన బుజ్జగింపుతో అధికారాన్ని కైవసం చేసుకోవాలని అనుకుంటున్నది' అని అన్నారు.

మోదీ, రాహుల్ వ్యాఖ్యలపై ఈసీ నోటీసులు

బీజేపీ, కాంగ్రెస్‌లకు తాఖీదులు

న్యూఢిల్లీ: ఎన్నికల కోడ్ ఉల్లంఘించారంటూ ప్రధాని మోదీ, కాంగ్రెస్ ముఖ్యనేత రాహుల్‌గాంధీపై వచ్చిన ఫిర్యాదులపై ఎన్నికల కమిషన్ (ఈసీ) ఎట్టకేలకు స్పందించింది. బీజేపీ, కాంగ్రెస్ చీఫ్‌లకు గురువారం ఈసీ నుంచి నోటీసులు జారీ అయ్యాయి. అయితే ఈ నోటీసుల్లో ఎక్కడా ప్రధాని మోదీ, రాహుల్‌గాంధీల పేర్లను ప్రస్తావించలేదు. వారికి వేరు వేరుగా నోటీసులు జారీచేస్తుందా?అన్నదానిపై ఈసీ స్పష్టత ఇవ్వలేదు. ఈ సందర్భంగా ఈసీ రాజకీయ పార్టీలకు కీలక సూచనలు జారీచేసింది. అభ్యర్థులు, స్టార్ క్యాంపెయినర్ల ప్రవర్తనకు, వారి వ్యాఖ్యలకు రాజకీయ పార్టీలే బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపింది. రాజస్థాన్‌లో మోదీ చేసిన ప్రసంగంపై కాంగ్రెస్, సీపీఐ, సీపీఎంలు ఈసీకి ఫిర్యాదు చేశాయి. రాహుల్‌గాంధీ, మల్లికార్జున్ ఖర్గే వ్యాఖ్యలపై బీజేపీ కూడా ఈసీని ఆశ్రయించింది. ఏప్రిల్ 29 ఉదయం 11 గంటల్లోగా ఈ ఆరోపణలపై వివరణ ఇవ్వాలని ఏఐసీసీ అధినేత మల్లికార్జున ఖర్గేకు ఈసీ నోటీసులిచ్చింది.

ప్రైవేటు ఆస్తిలో ప్రభుత్వం జోక్యం చేసుకోవచ్చు

- మహారాష్ట్ర కేసు విచారణలో సుప్రీం కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 25: ప్రైవేటు ఆస్తిలో ప్రభుత్వ జోక్యం చేసుకోవద్దని చెప్పడం సరికాదని సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. సమాజ వనరులు అంటే కేవలం ప్రభుత్వ ఆస్తులు మాత్రమేనని, ప్రైవేటు ఆస్తులను సమాజ వనరులుగా చూడొద్దని చెప్పడం ప్రమాదకరమని పేర్కొన్నది. మహారాష్ట్ర ప్రభుత్వం 1986లో మహారాష్ట్ర గృహ నిర్మాణ, ప్రాంత అభివృద్ధి చట్టం–1976కు చేసిన చట్ట సవరణ అంశాన్ని బుధవారం సుప్రీంకోర్టు విచారించింది. 70 శాతం మంది యజమానులు అంగీకరిస్తే ప్రభుత్వం ప్రైవేటు ఆస్తులను స్వాధీనం చేసుకొని పునరుద్ధరించవచ్చని ప్రభుత్వం ఈ చట్ట సవరణ చేసింది. దీనిని వ్యతిరేకిస్తూ ముంబైలోని ప్రాపర్టీ ఓనర్స్ అసోసియేషన్(పీఓఏ) హైకోర్టును ఆశ్రయించగా 1991 డిసెంబరులో బాంబే హైకోర్టు ఈ పిటిషన్‌ను కొట్టేసింది. దీంతో పీఓఏ సుప్రీంకోర్టుకు వెళ్లింది.

ఇలాంటి ఆలోచన ప్రమాదకరం: *సుప్రీం విచారణ సందర్భంగా సీజేఐ కీలక వ్యాఖ్యలు చేశారు. 'ప్రైవేటు ఆస్తి సంపూర్ణంగా ప్రైవేటుదే అని చెప్పేది పూర్తిగా పెట్టుబడిదారీ భావన అవుతుంది. అలాగే ఏ ఆస్తి కూడా వ్యక్తులకు మాత్రమే పరిమితమైనదని కాదని, ఆస్తులన్నీ సమాజానివని చెప్పేది పూర్తిగా సామ్యవాద దృక్పథం. మన దేశానిది పూర్తిగా సామ్యవాద పద్ధతి కాదు. ప్రైవేటు ఆస్తి అనేది ఉంటుంది. అయితే, సమాజ వనరులు అంటే కేవలం ప్రభుత్వ వనరులే అని, వ్యక్తులకు సంబంధించిన ప్రైవేటు ఆస్తులు సమాజ వనరులు కావని చెప్పడం కూడా సరికాదు. ఇలాంటి ఆలోచన ప్రమాదకరం' అని వ్యాఖ్యానించారు. ప్రైవేటు ఆస్తిపై బీజేపీ, కాంగ్రెస్ మధ్య రాజకీయ దుమారం నెలకొన్న నేపథ్యంలో సుప్రీం వ్యాఖ్యలకు ప్రాధాన్యం ఏర్పడింది.*

'అలాగైతే భారత్‌లో వాట్సాప్ ఉండదు'

న్యూఢిల్లీ: గోప్యతను వదిలేయాల్సి వస్తే వాట్సాప్ భారత్ నుంచి బయటకు వెళ్లిపోతుందని 'మెటా' సంస్థ ఢిల్లీ హైకోర్టుకు వెల్లడించింది. ఐటీ రూల్స్ – 2021లోని 4(2) నిబంధనను సవాల్ చేస్తూ వాట్సాప్ యాజమాన్య సంస్థ మెటా ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. ఏదైనా పోస్ట్ లేదా సమాచారం మొదట ఎవరి వద్ద నుంచి వచ్చిందనేది సోషల్ మీడియా సంస్థలు గుర్తించాలని ఈ నిబంధన చెప్తున్నది. అయితే, ఇలా చేయాలంటే కోట్లాది మెసేజ్‌లను ఏండ్ల తరబడి స్టోర్ చేయాల్సి ఉంటుందని వాట్సాప్ తరపు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. ఎండ్ టూ ఎండ్ ఎంక్రిప్షన్(ఎక్కడా మెసేజ్ స్టోర్ కాకుండా నేరుగా పంపించిన వారి నుంచి అందుకునే వారికి వెళ్లడం) విధానానికి విఘాతం కలుగుతుందని పేర్కొన్నారు. ఎండ్ టూ ఎండ్ ఎంక్రిప్షన్ వల్ల గోప్యత ఉంటుందనే నమ్మకంతోనే వినియోగదారులు వాట్సాప్‌ను వినియోగిస్తున్నారని, దీనికి భంగం కలిగే పరిస్థితే వస్తే తమపై వినియోగదారుల నమ్మకం దెబ్బతింటుందని వివరించారు.

యూపీఎస్‌సీ-2025

ఉద్యోగ క్యాలెండర్ విడుదల

న్యూఢిల్లీ, ఏప్రిల్ 25: కేంద్రంలోని ఉద్యోగ ఖాళీల భర్తీకి నిర్వహించే పరీక్షల క్యాలెండర్‌ను యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్‌సీ) విడుదల చేసింది. 2025 జనవరి నుంచి డిసెంబర్ వరకు నిర్వహించే పరీక్షల తేదీలను చార్ట్‌లో పొందుపరిచింది. ఆ ఏడాది జనవరి 22 నుంచి ఫిబ్రవరి 11 వరకు సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షకు దరఖాస్తులు స్వీకరించి 25న పరీక్ష నిర్వహిస్తారు. అదే ఏడాది ఆగస్టు 22 నుంచి ఐదు రోజుల పాటు యూపీఎస్సీ మెయిన్స్ పరీక్షలు జరుగుతాయి. అలాగే సీబీఐ (డీఎస్పీ), ఇంజనీరింగ్ సర్వీసెస్ (ప్రిలిమినరీ), సీఐఎస్ఎఫ్, ఎన్‌డీఏ, ఇండియన్ ఫారెస్ట్ సర్వీసెస్ ప్రిలిమినరీ, మెయిన్స్, సెంట్రల్ ఆర్మ్డ్ పోలీస్, సీడీఎస్, కంబైన్డ్ మెడికల్ సర్వీసెస్ తదితర ఉద్యోగ నియామక షెడ్యూల్‌ను ఆ చార్ట్‌లో వివరించింది.

ఐఐటీయన్లకూ కొలువుల వర్రీ

- క్యాంపస్ ప్లేస్‌మెంట్లలో 40% మందికి నో జాబ్స్
- ఉద్యోగాలు వచ్చినా.. ప్యాకేజ్ మాత్రం తక్కువే
- ఆర్థిక మందగమనమే కారణమంటున్న నిపుణులు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 25: ఐఐటీల్లో చదివిన వారందరికీ ఉద్యోగాలు పక్కా, లక్షల్లో, కొందరికి కోట్లలో ప్యాకేజీలు ఖాయం అనేది ఒకప్పటి మాట. ఇప్పుడు పరిస్థితులు కఠినంగా మారుతున్నాయి. ఐఐటీల్లో చదివినవారిలో దాదాపు 40 శాతం మందికి క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లలో ఉద్యోగాలు లభించడం లేదని, ఉద్యోగాలు వచ్చినవారిలోనూ చాలామందికి రూ.10 లక్షల లోపే వార్షిక వేతనం ఉంటుందని కొన్ని నివేదికలు చెప్తున్నాయి. ఉద్యోగాల కల్పన సేవలు అందించే ఆఫీస్ ఆఫ్ కెరీర్ సర్వీసెస్(ఓసీఎస్)లో 1,814 మంది ఐఐటీ–ఢిల్లీ విద్యార్థులు ఉద్యోగాల కోసం నమోదు చేసుకుంటే 1,083 మందికే లభించాయి. అంటే దాదాపు 40 శాతం మందికి ఉద్యోగాలు దొరకలేదు. గత ఐదేండ్లలో 22 శాతం మంది విద్యార్థులకు ఉద్యోగాలు దొరకలేదని ఓ ఆర్టీఐ దరఖాస్తు ద్వారా వెల్లడైంది. ఇక ఐఐటీ–కాన్పూర్ విషయానికి వస్తే.. 2022లో 90 శాతం మందికి, 2023లో 91 శాతం మందికి ఉద్యోగాలు లభిస్తే ఈ ఏడాది మాత్రం 69 శాతం మందికే ఉద్యోగాలు వస్తాయని అంచనా వేస్తున్నారు. ఐఐటీ–బాంబేలో గత ఏడాది 1,485 మంది విద్యార్థులకు ఉద్యోగాలు దొరకగా 32.8 శాతం మందికి నిరాశే ఎదురైంది. ఇంతకుముందు క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లకు వచ్చి 6 – 8 మందిని ఎంపిక చేసుకునే కంపెనీలు ఇప్పుడు గరిష్ఠంగా ఒకరిద్దరిని మించి ఎంపిక చేయడం లేదు. దీంతో ఐఐటీల్లోని ప్లేస్‌మెంట్ కార్యాలయాల అధికారులు క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లకు ఎక్కువ కంపెనీలు హాజరయ్యేలా చూసేందుకు ప్రయత్నిస్తున్నారు.

రూ.10 లక్షల లోపే వార్షిక వేతనం

క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లలో ఉద్యోగాల భర్తీ తగ్గిపోవడం ఒక సమస్య అయితే.. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు లభిస్తున్న వేతనాలు కూడా అంతగా ఆశాజనకంగా లేవు. క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లలో ఎంపికైన చాలామందికి రూ.10 లక్షల లోపు వార్షిక వేతనాన్ని మాత్రమే ఇచ్చేందుకు కంపెనీలు ఆఫర్ చేస్తున్నాయి. ఐఐటీ–ఖరగ్‌పూర్‌లో ఓ కంపెనీ ట్రెయినీ ఇంజినీర్ ఉద్యోగాలకు రూ.3.6 లక్షలు, ట్రెయినీ డిజైన్ ఇంజినీర్ ఉద్యోగాలకు రూ.6 లక్షల వార్షిక వేతనం మాత్రమే ఆఫర్ చేసింది. వివిధ ఐఐటీల్లో చదువుతున్న చాలా మంది విద్యార్థులు రూ.6 – 7 లక్షల వార్షిక వేతన ప్యాకేజీలకు ఉద్యోగాలు పొంది.. తర్వాత అది సరిపోక మళ్లీ కొత్త ఉద్యోగాలను వెతుక్కుంటున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక మందగమనం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) ప్రభావం వల్లనే ఐఐటీల్లో చదువుతున్న విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు, వేతనాలు తగ్గుతున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

హార్లిక్స్‌పై 'హెల్త్ డ్రింక్' లేబుల్ తొలగింపు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 25: ప్రసిద్ధి గాంచిన హార్లిక్స్.. కంపెనీ తన లేబుల్‌పై కీలక మార్పులు చేసింది. 'హార్లిక్స్'ను 'హెల్త్ డ్రింక్'గా పేర్కొన్న 'హిందుస్తాన్ యూనిలీవర్' (హెచ్‌యూఎల్), దాన్ని తొలగించి.. 'ఫంక్షనల్ న్యూట్రిషినల్ డ్రింక్స్'గా మార్చింది. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ ఇటీవల జారీచేసిన ఉత్తర్వుల మేరకు హెచ్‌యూఎల్ ఈ మార్పును చేపట్టినట్టు తెలుస్తున్నది. బోర్న్‌విటా, హార్లిక్స్‌లలో చక్కెర స్థాయిలు అధికంగా ఉన్నాయన్న ఆరోపణలు రావటంతో ఈ పరిణామం చోటుచేసుకుంది. బాలల హక్కుల పరిరక్షణ జాతీయ కమిషన్ దీనిపై స్పందిస్తూ, ఈ అంశంపై విచారణ జరపాలని 'ఎఫ్ఎస్ఎస్ఏఐ'ని ఆదేశించింది. దీంతో కంపెనీలు తమ ఆహార ఉత్పత్తుల లేబుల్‌పై మార్పులు చేసినట్టు తెలుస్తున్నది.

'స్త్రీ ధనంపై భర్తకు హక్కు ఉండదు'

*న్యూఢిల్లీ, ఏప్రిల్ 25: పెళ్లి సందర్భంగా వధువుకు పుట్టింటి వారు బహుమతిగా ఇచ్చే స్త్రీ ధనంపై సుప్రీం కోర్టు కీలకమైన తీర్పును వెలువరించింది. స్త్రీ ధనంపై భర్తకు ఎలాంటి నియంత్రణ ఉండదని, అయితే కుటుంబం ఇబ్బందుల్లో ఉన్నప్పుడు దాన్ని వాడుకోవచ్చునని, అయితే తర్వాత దానిని, లేదా దానికి సరిపడా మొత్తాన్ని భార్యకు తిరిగి ఇవ్వాల్సిన నైతిక బాధ్యత భర్తపైనే ఉందని స్పష్టం చేసింది. అది ఉమ్మడి ఆస్తి ఎంతమాత్రం కాదని, దానిపై ఎలాంటి ఆధిపత్యం కానీ, యాజమాన్య హక్కులు కానీ భర్తకు